క్లుప్తంగా

పోలీస్ కుటుంబాలకు చేయూత



పోలీస్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: కోవిడ్‌తో మృతి చెందిన రెండు పోలీస్ కుటుంబాలకు చేయూత లభించింది. మేన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్ సీఎస్‌ఆర్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా కోవిడ్‌తో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కాకినాడ జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ కోవిడ్‌తో మృతి చెందిన ఇద్దరు పోలీసుల కుటుంబాలకు చెరో రూ.మూడు లక్షలు చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బచ్చు మోహన్‌రావు, హోంగార్డు పంపన శ్రీనివాస్ కుటుంబాలకు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు బుధవారం ఆయన కార్యాలయంలో ఈ చెక్కులను అందించారు.

సీతారామస్వామికి వైభవంగా లక్షతులసి పూజ

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామికి ధనుర్మాసం సందర్భంగా బుధవారం లక్షతులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, అనంతరం లక్ష తులసి దళాలతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తులసీదళాలతో, పువ్వులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. తులసిపూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిక్కిన వెంకటరాయచౌదరి పాల్గొన్నారు.

గాంధీనగర్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

బాలాజీచెరువు: గాంధీనగర్ శాఖా గ్రంథాలయానికి బుధవారం పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన గోలి వీరవెంకట సత్యసాయిరాం ప్రసాద్ జ్ఞాపకార్థం వారి సోదరులు గోలి వీరవెంకట సతీష్ రూ.50వేలు విలువగల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుటుంబ సభ్యులను లైబ్రేరియన్ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావుతో పాటు పాఠకులు అభినందించారు.

స్ట్రాంగ్‌రూంల పరిశీలన



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న వీసీ ప్రసాద్‌రాజు, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: ఫిబ్రవరి నెలలో జరగబోయే కానిస్టేబుల్ నియామక పరీక్షల పత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను బుధవారం కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ప్రసాద్‌రాజుతో కలిసి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పరిశీలించారు. స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించనున్న ఈ పరీక్షల్లో భాగంగా జనవరి 22వ తేదీన ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రిలిమినరీ, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ పరీక్ష పత్రాలను సైతం స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచినట్టు తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె అకస్మికంగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి మీటింగ్ హాల్, స్పందన, వీడియో కాన్ఫరెన్స్, ఆర్డీఓ చాంబర్, భూ సేకరణ, రీ సర్వే రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ తీరు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ నిర్వహణ తీరుపై ఆర్డీఓను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

లేగ దూడల ప్రదర్శన

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో బుధవారం పశు సంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భాధారణ వల్ల పుట్టిన లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. లేగదూడల పెంపకం, పరిరక్షణపై అవగాహన కల్పించారు. పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేస్తున్న లింగ నిర్ధారిత వీర్యం, పెయ్యదూడల ఉత్పత్తిపై రైతులకు వివరించారు. బుర్రా జాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంయుక్త సంచాలకులు ఎస్.సూర్యారావు, డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చేసింది

- రంగవల్లులతో అందంగా తయారైన ముంగిళ్లు
- ఊపందుకున్న పండగ వ్యాపారాలు



కాకినాడలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు

కాకినాడ సిటీ: సంక్రాంతి ఒక పండగ మాత్రమే కాదు. ఎన్నెన్నో అనుభూతులు, మరెన్నో మేళవింపులు, భావోద్వేగాలు, ఒక మాటలో చెప్పాలంటే ఏడాదికి సరిపోయే ఎన్నో తీపి జ్ఞాపకాలను పంచే వేడుక. అలాంటి పండగ మరో రెండు రోజుల్లో రానుంది. అంతకన్నా ముందే జిల్లాలో పండగ జోష్ మొదలైంది. ముగ్గులతో ఇళ్ల లోగిళ్లు కళకళలాడుతున్నాయి. పట్టణాల్లోని వారే కాక గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా షాపింగ్ కోసం ఆయా ప్రాంతాల్లోని పట్టణాలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి. దుస్తుల దుకాణాలు, కిరాణా షాపులు కిక్కిరిస్తున్నాయి. సింహభాగం వ్యాపారం దుస్తులు, వంట సరుకుల ద్వారానే సాగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహిళల అలంకరణకు సంబంధించిన వస్తువులను జోరుగా కొనుగోలు చేస్తున్నారు.


ఆఫర్లతో ఆకర్షణ..

పండగంటే ఆఫర్లు, ఆఫర్లంటే ఆకర్షణ ఇదే మంత్రాన్ని అనేక మంది వ్యాపారులు పాటిస్తున్నారు. కొంతమంది ప్రజలను ఆకర్షించేందుకు కొన్ని రకాల దుస్తులు, మహిళలకు సంబంధించిన వస్తువులపై, పాదరక్షలపై డిస్కౌంట్ ఆఫర్లు పెట్టారు. వారం రోజులుగా రోజురోజుకు వ్యాపారాలు ఊపందుకుంటున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నిత్యం కోట్ల రూపాయిల్లోనే వ్యాపారాలు సాగుతున్నట్టు సమాచారం

ఆన్‌లైన్లో జోరుగా కొనుగోళ్లు

ప్రస్తుతం అందరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండడంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం సంక్రాంతి కావడంతో పురుషులు ప్యాంట్లు, షర్ట్స్, షూస్, మహిళలు, చీరలు, చిన్నపిల్లల దుస్తులు, రోల్డ్‌గోల్డ్ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. హిందువులకు సంక్రాంతి పెద్ద పండగ. అందువల్ల నిరుపేదలు కూడా ఈ పండగను ఉన్నంతలో ఘనంగా జరుపుకొంటారు. బంధువులను, ఆడబిడ్డలను, అల్లుళ్లను విధిగా ఆహ్వానిస్తారు. ఇంటికి వచ్చిన అతిథులకు వారివారి స్తోమతను బట్టి దుస్తులు పెట్టి, ఆతిథ్యాలు ఇస్తారు. సంక్రాంతి సందర్భంగా పేదలకైనా తక్కువలో తక్కువ అంటే రూ.పదివేలు ఖర్చవుతోంది. ఎక్కువ సంఖ్యలో బంధువర్గం కలిగిన ధనవంతులు సంక్రాంతికి రూ.లక్షలు కూడా ఖర్చు చేస్తారు.

సంప్రదాయాన్ని పాటిస్తాం



పెద్ద పండగ సంవత్సరానికి ఒకసారి వస్తుంది. మేము చిన్నప్పటి నుంచి ఇంటిల్లపాదీ సంక్రాంతికి కొత్త దుస్తులు కొంటాం. కాలం మారినా ఈ సంప్రదాయాన్ని మాత్రం పాటిస్తున్నాం. పండగను ఉన్నంతలో సంతోషంగా జరుపుకోవాలి.
– నందిక వరలక్ష్మి, కాకినాడ



వివిధ కళాశాల్లో, ప్రాంతాల్లో రంగవల్లులు



కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్‌లో సంక్రాంతి సందడి



కాకినాడ ఏపీఎస్పీలో భోగి మంటలో దండలు వేస్తున్న కమాండెంట్, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



ప్రకృతి వ్యవసాయం



ఎస్పీ సతీమణికి సోది చెబుతున్న విద్యార్థిని

సందడే సందడి..

- పండగ సందడిలో బెటాలియన్ సిబ్బంది
- కుటుంబ సభ్యులతో సంప్రదాయం ఉట్టిపడేలా వేడుక
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు దంపతులు

కాకినాడ రూరల్: నిత్యం ప్రజారక్షణలో ఉండే కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ పోలీసులు పని ఒత్తిడిని పక్కన బెట్టి తమ కుటుంబ సభ్యులతో తెలుగింట సంప్రదాయ పండగ సంక్రాంతిని బుధవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. రమణయ్యపేటలోని బెటాలియన్ క్యాంపు కార్యాలయం ఆవరణలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్.భద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మన సంప్రదాయాలను గుర్తు చేశాయి. ఆకట్టుకునే రంగవల్లులు, హరిదాసులు, భోగి మంటలు, పొంగలి, బొమ్మల కొలువు, కోడి పందాలు, పుంగనూరు ఆవులు, పొట్టి మేకలు, గుర్రపు స్వారీ, ఎడ్ల బండెలు ఆకట్టుకున్నాయి. లంగా ఓణీలతో యువతులు, సంప్రదాయ దుస్తులతో మగ, ఆడవారు, హరిదాసు, బుడబుక్కలోడు, కృష్ణుడు, గోదాదేవి తదితర వేషధారణలతో చిన్నారులు అలరించారు. పోటీలకు ముఖ్యఅతిథిగా బెటాలియన్ కమాండెంట్ హోదాలో జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు దంపతులు హాజరయ్యారు. భోగి మంటలను ఎస్పీ రవీంద్రనాథ్ బాబు వెలిగించి సంబరాలు ప్రారంభించారు. ఎస్పీ భార్య హేమదేవి గోదాదేవికి పూజ చేసి, పొంగలి కోసం పొయ్యి వెలిగించి, తయారు చేశారు. సోది చెప్పే మహిళతో ఎస్పీ సతీమణి సోది చెప్పించుకున్నారు. సంబరాలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రోటరీ వృద్ధాశ్రమంలో సంక్రాంతి వేడుకలు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ వృద్ధాశ్రమంలో బుధవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు, వృద్ధాశ్రమ కమిటీ కార్యదర్శి సత్తి రవిరెడ్డి ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న వారికి నూతన వస్త్రాలు, పండ్లు అందించారు. ఈ సందర్భంగా రవిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దకాలంగా క్రమం తప్పకుండా ఆశ్రమంలోనే వృద్ధుల సమక్షంలో పండగ నిర్వహించుకోవడం తమ కుటుంబ సభ్యులందరికీ ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆశ్రమంలో వృద్ధులతోపాటు బర్మాకాలనీలో ఉంటున్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ చైర్మన్ ఉదయభాను పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి

కాకినాడ సిటీ: పాఠశాలల ముగింపు వేళ విద్యార్థినులు సందడి చేశారు. గొబ్బెమ్మలు, రంగవల్లులతో ఒక రోజు ముందే పాఠశాలకు సంక్రాంతి శోభను తెచ్చారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణను రంగవల్లులతో తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. భోగిమంటలు వేసి నృత్యంతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ స్థాయిని మరిచి కాసేపు విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పండుగల ప్రాముఖ్యాన్ని, సంప్రదాయాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి వి.వెంకట్రావు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక ముగ్గుల పోటీలు

కాకినాడ రూరల్: పండూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు నాలుగో బహుమతిని కూడా కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకటశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంటి, నందిపాటి ధర్మారావు, రాంబాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటల నడుమ విద్యార్థినుల సందడి



ఆశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సత్తి రవిరెడ్డి

అరట్లకట్టలో సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో హరిదాసు, సంప్రదాయి దుస్తులలో విద్యార్థులు

కరప: స్థానిక కరప జెడ్పీ ఉన్నత పాఠశాల, అరట్లకట్ట ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించి, భోగిమంటలను వేసి, సంప్రదాయ నృత్యాలతో సంక్రాంతికి ఘనంగా స్వాగతం పలికారు. డూడూ బసవన్న విన్యాసాలతో పాటు ఎడ్లబండ్లు ఎక్కి గ్రామంలో ఊరేగారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంప్రదాయ నృత్యాలతో సంక్రాంతికి స్వాగతం పలికారు. సంప్రదాయ క్రీడలే ముద్దు–జూద క్రీడలు వద్దు అంటూ కరప పోలీసులు ప్లకార్డులతో ప్రజలను చైతన్య పరిచారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఈ సంక్రాంతి సంబరాల్లో సర్పంచ్‌లు గోపె సత్యవేణి, సాదే ఆశాజ్యోతి, హెచ్‌ఎంలు పత్తి సత్యనారాయణ, యు.లీలామనోహర్, ఎస్వీ రామకృష్ణ, సోడగం సూరిబాబు, ఎంపీటీసీ చల్లా కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ కళాశాలలో..



సంధ్య ఫిజియోథెరపీ కళాశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కరప: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక సంధ్య ఫిజియోథెరపీ కళాశాలలో బుధవారం ఫ్యూజన్–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణం రంగవల్లులు, క్లాస్‌రూమ్ డెకరేషన్స్, పాటలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ టాలెంట్‌ను ప్రదర్శించారు. సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ఏటా పండగలను జరుపుకోవాలని సూచించారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ బి.శివశిరీష, డైరెక్టర్ బి.భరత్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ చేతుల మీదుగా బుధవారం దుస్తులు పంపిణీ చేపట్టారు. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పాండు రంగారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 74 మంది పారిశుధ్య కార్మికులకు రెండు జతల యూనిఫామ్, ఒక జత సివిల్ దుస్తులతో పాటు రెండు జతల చెప్పులు, రెండు లీటర్ల కొబ్బరి నూనె, 12 సంతూరు సబ్బులు, 12 రిన్ సబ్బులు చొప్పున అందించారు. అనంతరం పారిశుధ్య విధుల కోసం కొనుగోలు చేసిన తొట్టి రిక్షాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గంపల సత్యనారాయణ, కరీం భాషా, కర్రి చక్రధర్, నల్లా రాణి, యాళ్ల సుబ్బారావు, కడియాల రాజు, భవాని, గొల్లపల్లి కాశీ, వడ్డి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల రహిత నగరంగా కాకినాడ

- గడప గడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడను సమస్యల రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం ఆయన 12వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, పలువురు అధికారులు, కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే కాకినాడ నగరంలోని దాదాపు అన్ని డివిజన్లలో రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు పూర్తి చేశామని, అక్కడక్కడా మిగిలిన పనులను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే ప్రతి ఇంటికి వస్తామని, స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షల నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. నిత్యం ప్రజల పక్షాన ఆలోచించే ఇటువంటి సీఎంను వచ్చే ఎన్నికల్లో కూడా మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, వసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, నగర బీసీసెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, స్థానిక నాయకులు పరశురామ్, మట్టపర్తి రఘు, దుర్గాప్రసాద్, జితేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొంగోడులో విజయవంతంగా గడపగడపకూ..

మూడు రోజులపాటు గ్రామంలో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన



గడప గడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కరప మండలం కొంగోడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమం బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో ఇంటింటికి వెళ్లి నవరత్నాలు, సంక్షేమ పథకాలను వివరించారు. వాటి ద్వారా పొందిన లబ్ధిని తెలిపారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని అధికారులతో పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల పట్టాలతోపాటు ఇంటి రుణాలను మంజూరు చేశారని, వాటి నిర్మాణాలను చేపట్టాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం అందించని పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ముఖ్యమంత్రిగా జగన్‌కు మరోసారి ఆశీర్వచనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ నక్కా అప్పలస్వామి(బాబులు), వైస్ సర్పంచ్ వనుం నారాయణరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న పండగల వైభవం నృత్యరూపకం



పండగల వైభవం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న సభ్యులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యకళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. సత్యకళావాహిని సభ్యులు ప్రదర్శించిన పండగల వైభవం నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఆధ్యాత్మిక వేత్త కూచి శ్రీహరిమన్నార్ రామాయణ ఘట్టాలను భక్తులను వివరించారు. అనంతరం కళాకారుడు కె.భాస్కరరామంను సత్యకళావాహిని సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, శారదాదేవి, గుర్రం ఆదినారాయణ, సుబ్బలక్ష్మి, బి.కోటేశ్వరావు, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

మేలో అమృత్ ఉత్సవాలు

- స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ రమేష్ వెల్లడి

కాకినాడ: కేంద్ర మంత్రి పట్టాభివృద్ధి మంత్రిత్వ శాఖ, స్మార్ట్‌సిటీ మిషన్ ఆధ్వర్యంలో మే నెలలో అమృత్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఈ అంశంపై స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కునాల్ కుమార్ బుధవారం దేశంలోని వివిధ స్మార్ట్‌సిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కమిషనర్ రమేష్ వీటి వివరాలను వెల్లడించారు. స్మార్ట్‌సిటీకి ఎంపికైన 100 నగరాల్లో కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో పెద్ద ఎత్తున అమృత్ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా సైక్లింగ్ పోటీలు, స్మార్ట్‌సిటీల్లోని ముఖ్య ప్రాంతాలు సందర్శన, ర్యాలీ నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా వీటిని వేడుకగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశంలో పలు ప్రతిపాదనలపై చర్చించామన్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించి ఉత్సవాలు తేదీలు, చేపట్టే కార్యక్రమాల వివరాలను ప్రకటిస్తామన్నారు. స్మార్ట్‌సిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం

సామర్లకోట: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ఏర్పాటు చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు బుధవారం సామర్లకోటలో స్వాగతం పలికారు. ఈ రైలు ఈనెల 19 నుంచి నడుపుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయిల్ రన్ నిర్వహించారు. రాజమహేంద్రవరం తరువాత ఈ రైలు విశాఖపట్నంలో మాత్రమే ఆగుతుంది. ఈ మేరకు సామర్లకోట వచ్చిన రైలుకు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఆయా రైల్వే ముఖ్య కూడలి ప్రదేశాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలరించిన పంచరత్న సేవ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం త్యాగరాజ ఆరాధనోత్సవం జరిగింది. ముందుగా త్యాగరాజ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి ఆరాధనోత్సవం ప్రారంభించారు. సంగీత విద్వాంసులతో సంగీత కచేరీ నిర్వహించారు. వీరు వాగ్గేయకారులు త్యాగరాజు కృతులైన పంచరత్నాలు ఆలపించారు. జగదానందకారక..., ఎందరో మహానుభావులు..., దడుకుగల..., సాధించెనే.. తదితర కృతులు ఆలపించి అలరించారు. సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, ఆకొండి వెంకట్రావు వీరి శిష్యులు సంగీత కచేరీలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి సరస్వతీగానసభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, మణిబాబు, కృష్ణంరాజు, మునిగంటి వెంకట్రావు హాజరయ్యారు.



పంచరత్నాలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తదితరులు